క్లుప్తంగా

జోరుగా డివైడర్ పనులు



డివైడర్ మధ్య వేసిన ఎర్రమట్టి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన సర్వీసురోడ్డు డివైడర్ సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులకు అవసరమైన భారీ యంత్ర పరికరాలను షిప్‌యార్డ్ నుంచి తరలించడానికి అధికారులు డివైడర్ తొలగించిన విషయం తెలిసిందే. విస్తరణ పనులు దాదాపు పూర్తి కావడంతో భారీ యంత్రాల రాకపోకలు లేవు. దీంతో యుద్ధ ప్రాతిపదికన డివైడర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

పార్టీ కార్యకర్తకు పరామర్శ



భానును పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: అనారోగ్యంతో ఎన్‌ఏడీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్త షకీలా భానును డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామారావు

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్.రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీ కార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరెలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నేవల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్వో రెయ్యిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నాగేశ్వరరావు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. వివరాలిలా.. నాగేశ్వరరావు అనే వ్యక్తి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో లైసెన్స్ కూలీగా పనిచేస్తుంటాడు. ఇతడు భార్య, కుమార్తెతో కలిసి మధురవాడలో నివసిస్తున్నాడు. ప్రస్తుతం అనారోగ్యం కారణంగా తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో ఉంటున్న అతడి సోదరుడు ఇంటి వద్ద నుంచి పనికి వెళ్తున్నాడు. ఈ నెల 18న పనికి వెళ్లి వస్తానని చెప్పి సోదరుడి ఇంటి వద్ద నుంచి నాగేశ్వరరావు బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు త్రిమూర్తులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వి.రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

- చెత్తతో నిండిన పరిసరాలు, డ్రైనేజీలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



62వ వార్డు మల్కాపురం మార్కెట్‌లోని కాలువ దుస్థితి



40వ వార్డులో చెత్తాచెదారం, పూడికతో నిండిన డ్రైనేజీ

సింథియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఆయా ప్రాంతాలతోపాటు మల్కాపురం మార్కెట్, డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందులు, కుక్కల సంచారం అధికమై వీధులన్నీ దుర్గంధభరితంగా మారాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్ల నిండా వ్యర్థాలే కనిపిస్తున్నాయి. చెత్తతోపాటు భవన నిర్మాణ వ్యర్థాలను ప్రధాన రహదారులకు ఇరువైపులా డంప్‌చేస్తున్నారు. ఈ చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు ఉండటం.. వాటిని పశువులు తిని మృత్యువాత పడటం వంటి ఘటనలు జరుగుతున్నాయి. పరిసరాలు, డ్రైనేజీలు చెత్తతో నిండటంతో ఆందోళన కలిగిస్తోందని ఆయా వార్డుల ప్రజలు అంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రకాష్‌నగర్ పోర్టు మైదానం వద్ద చెత్తాచెదారంతో నిండిన స్థలంలో సంచరిస్తున్న పందులు

రోడ్లు ఊడ్చరు.. చెత్త తీయరు!



షిప్‌యార్డ్ ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో పలు వీధుల్లో చెత్తకుప్పలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగు కాలువలు పూడుకుపోయి కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

డంపింగ్ యార్డులుగా ఖాళీ స్థలాలు

డంపర్ బిన్లు చెత్తతో నిండిపోతున్నా రోజుల తరబడి తరలించడం లేదు. ఫలితంగా నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. జీవీఎంసీ 40వ వార్డు సింథియా న్యూకాలనీలోని షిప్‌యార్డ్ విద్యా సంస్థల వెనుక ఖాళీ స్థలాన్ని డంపింగ్ యార్డ్‌గా వినియోగిస్తున్నారు. దీంతో ప్రహరీకి ఆనుకొని జైఆంధ్రా కాలనీ, కాకరలోవ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద విపరీతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



షిప్‌యార్డ్ కాలనీ ప్రహరీలోపల డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త కుప్పలు

చురుగ్గా విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే



సర్వే చేస్తున్న ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్

కంచరపాలెం: విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు విద్యా శాఖాధికారులు, సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. గోపాలపట్నం మండల పరిధిలో సర్వే చురుగ్గా కొనసాగుతోంది. మండల విద్యా శాఖాధికారులు-1, 2 సోమేశ్వరరావు, దివాకర్ పర్యవేక్షణలో శుక్రవారం కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రవాణా భత్యం, దివ్యాంగుల భత్యం తదితర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఇంత వరకు బుద్ధి మాంద్యం గల ఐదుగురు, వినికిడి లోపం ఒకరు, మెదడు పక్షవాతం ముగ్గురు చొప్పున దివ్యాంగులను గుర్తించామని తెలిపారు. వారిని సమీప పాఠశాలల్లో నమోదు చేయిస్తామన్నారు. సర్వే కార్యక్రమంలో సీఆర్‌పీ లంక చైతన్య, ఐఈఆర్టీ టీచర్లు మహాలక్ష్మి, మాధవి, జ్యోతినగర్ పాఠశాల హెచ్ఎం సిహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎల్‌జీ పాలిమర్స్ విరాళం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎల్‌జీ పాలిమర్స్ సంస్థ రూ.4 లక్షల విరాళం అందించింది. ఇటీవల నిర్వహించిన అమ్మవారి పండగ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఎల్‌జీ పాలిమర్స్ యాజమాన్యాన్ని కమిటీ సభ్యులు కోరారు. స్పందించిన కంపెనీ యాజమాన్యం రూ.4 లక్షల విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేసింది. ఈ నగదుతో ఆలయంలో భక్తుల కోసం సౌకర్యాలు కల్పిస్తామని సభ్యులు తెలిపారు.

విస్తృతంగా కార్డన్ సెర్చ్

గోపాలపట్నం: స్థానిక ఆశవానిపాలెంలో వెస్ట్ డివిజన్ పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పలు స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది ఆశవానిపాలెంలో పలు ఇళ్లల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జూన్ నెల 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఎటువంటి ఆధారాలు లేని 9 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించి వాహనాలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. నేరాలు, అల్లర్లకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు.



ఆశవానిపాలెంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రౌతు కుమార్ కుటుంబ సభ్యులు, ఆకుల రేణుక, ఆకుల పూజిత, సూరిబాబు, రౌతు చంటి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 41.1 కేజీల గంజాయి స్వాధీనం

జీఆర్పీ అదుపులో గంజాయి రవాణాదారుడు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన బస్వా అప్పారావు వద్ద నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.2.05 లక్షల విలువైన 41.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.



గంజాయి, రవాణాదారుడితో జీఆర్పీ సిబ్బంది

బాలిక అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న గిరి దుర్గాభవాని ఈ నెల 23వ తేదీ గురువారం రాత్రి 9 గంటలకు సోడా తెస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి గిరి సుహాసిని శుక్రవారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన బాలిక పదో తరగతి చదువుతోంది. 4 అంగుళాల 5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు కలిగి ఉంటుంది. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పోస్టర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్: యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని.. ఏపీలో జూన్ 15 వరకు, తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలిచిన వారికి ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విశాఖ వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలకు స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజీని సందర్శించాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ రంగాల్లో అన్ని వయసుల వారి ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

చందనోత్సవంలో బాలల వసతులపై ప్రశంస

సింహాచలం: ఈ నెల 10న జరిగిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో బాలలు ఇబ్బంది పడకుండా సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారని ఏపీ బాలల వాక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈమేరకు శుక్రవారం సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని సీతారాం ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ఇతర ఉన్నతాధికారుల సహాయసహకారాలతో భక్తులు ఇబ్బంది పడకుండా మెరుగ్గా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఈవో శ్రీనివాసమూర్తికి ప్రశంసా పత్రం అందజేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

మూఢనమ్మకాలతో అనర్థాలు

ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి



ప్రదర్శనలో పాల్గొన్న సీడీపీవో, ఏసీడీవో తదితరులు



ఎన్‌ఏడీలో ప్లకార్డులతో మానవహారం

విశాఖ విద్య: ఆరోగ్యమే మహాభాగ్యం అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ విశాఖ అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్(సీడీపీవో) అధికారి రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత అన్నారు. 'ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సింహాచలం సెక్టార్ పరిధిలోని ఎన్‌ఏడీ వెంకటాపురం(గణేష్ నగర్) అగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కిశోర బాలికలు, బాలింతలు, మహిళలతో ఎన్‌ఏడీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రమణకుమారి, శ్రీలత మాట్లాడుతూ మూఢనమ్మకాలతో అనర్థాలు వస్తాయన్నారు. నెలసరి సమయంలో తగిన పరిశుభ్రత పాటించటం ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలను తప్పించుకోవచ్చన్నారు. కిశోర బాలికలు ఈ విషయంలో సంకోచం లేకుండా తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. తద్వారా భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్యపరమైన సమ్యలను ముందుగానే నివారించే అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య నియమాలు పాటిస్తూనే తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ఎంతో రుచికరమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, కార్యకర్త మార్త తదితరులు పాల్గొన్నారు.

పార్కు గేటుకు అడ్డంగా పార్కింగ్

ఇబ్బంది పడుతున్న వాకర్స్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకర్స్ పార్కు వద్ద గేటుకు అడ్డంగా పలువురు వాహనాలు పార్క్‌చేస్తున్నారు. దీంతో పార్కులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాకర్స్ వాపోతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో పలువురు వాకర్స్ నిత్యం ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామాలు చేస్తుంటారు. ఇక్కడికి కాలక్షేపం కోసం వచ్చే కొంత మంది యువకులు తమ వాహనాలను పార్కు గేటుకు అడ్డంగా నిలుపుతున్నారు. వాకింగ్‌కు వచ్చే సీనియర్ సిటిజన్లు వాటిని తప్పించుకుని లోపలికి వెళ్లలేని పరిస్థితి కలుగుతోంది. అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.



గుల్లలపాలెం వాకర్స్ పార్కు గేటుకు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది.గత నెల 29 నుంచి ఈ నెల 24 వరకూ నిర్వహించిన శిబిరంలో 5,6 తరగతులతో పాటు 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. విద్యార్థులకు యోగ,గణితం,వేద గణితం,ఇంగ్లిష్,వేద సూక్తులు,వేద విద్య,భజనలు,సంస్కృత సంభాషణ వంటి వాటిలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులంతా వారు నేర్చుకొన్న వేద మంత్రాలను పఠించి తల్లిదండ్రులతో పాటు ఆహుతులను ఆకట్టుకున్నారు.బాటజంగాలపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఏయూ సంస్కృత అధ్యాపకుడు వీర వరప్రసాద్, గుంటూరు నుంచి వచ్చిన గణిత అధ్యాపకులు మల్లాది నరసింహమూర్తి, అధ్యాపకురాలు సత్యవతి బోధించారు. శిబిరంలో పాలకొల్లు,యలమంచిలి,గోపాలపట్నం,గాజువాక,సబ్బవరం, బలిజపాలెం ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

మహారాణిపేట: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి పార్లమెంట్, అంసెబ్లీకి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతం కావాలని సూచించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. ఆయా నియోజకవర్గాల ఆర్‌వోలు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

కల్యాణం.. కమనీయం



పాల్గొన్న ఉభయదాతలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.